


# "హాస్యరచయిత మరణించాడు"

రచన — తురగా కృష్ణమోహన్‌రావు

ఒక చిన్న ఉపోద్ఘాతం: ఈ కథ పేరు 'హాస్యరచయిత మరణించాడు.' నిజంగా మరణించలేదు. అంతా ఉట్టుట్టిదే. కథ గదా మరి?

కథ: నాకీ కథ ఎలా ప్రారంభించాలో అర్థం కావడంలేదు. ఈ కథంతా విన్న తరువాత మీరు బహుశః ఇది కథే కాదని అంటారేమో? అసలు నాకు కథలు రాయడం చేతకాదు. కాని ఈ రోజుల్లో ప్రతివాడూ కథ రాసేవాడే! ఆ పక్కింటి అబ్బాయిని గురించి సగం కథ, ఈ పక్కింటి అమ్మాయిని గురించి సగంకథ తీసుకొని; సగం జరిగింది, సగం జరగంది కథలల్లేస్తున్నారు మన వాళ్ళందరూ. నాలో అసూయ, బ్రద్దలవడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలోలా రగిలింది. నేను కూడా కథ రాయాలని నిశ్చయించుకొన్నాను. కథ రాయాలని కూచుంటే, ఖర్మ కాజువల్ లీవుకి దరఖాస్తు పెడుతుందని మీకు తెలుసు. అందుకని ఆంధ్రదేశపు రచయితల అడుగుజాడలను అనుసరించి, మా పక్కింటి అబ్బాయిని గురించి సగంకథ, అటు పక్కింటి అమ్మాయిని గురించి సగం కథ తీసుకొని; జరిగింది సగం, జరగంది సగం కలిపి కథ రాసేశాను. అంతా విని, మీరు ఇది కథ కాదంటే, నేను చేయగలిగింది ఏమీ లేదు. మీరు ఇది కథ అని అంగీకరిస్తే మాత్రం, వినండి, ఈ కథాంతంలో నా కథానాయకుడు విషం తిని చనిపోయాడు. ఇది కథే కనక ఐతే, విషాదాంత కథ ఔతుంది.

నేనిక్కడికి విచారభారంతో క్రుంగిపోతూ వచ్చాను. కారణం — ప్రఖ్యాత హాస్యరచయిత, యువకుడు, నటుడు, ముందు ఇంకా వృద్ధిలోనికి రావలసినవాడు కృష్ణమోహనరావు, ఈ నాటి - అంటే డిసెంబరు 22 వ తేదీ-మధ్యాహ్నం రెండు గంటలకు విషం తీసుకొని మరణించాడు. అతను చనిపోయేవరకు నేను అతనితోనే ఉన్నాను. బ్రతికున్న రోజుల్లో అతనికళ్ళు చారదేసి ఉండేవి. నిజానికి అతను విషం తిని చనిపోడానికి తగినంత కారణమేమీ లేదు. ఈ ప్రపంచంలో అతనికంటె ఎక్కువ కష్టాలు పడ్డవాళ్ళున్నారు. ఆ సంగతి నాకూ తెలుసు, అతనికీ తెలుసు. 'నేను హాస్యంగా బ్రతుకుతున్నాను కనక ఎన్నడో హాస్యంగానే, కారణం లేకుండానే, చనిపోతాను' అంటూండేవాడు నాతో. నేనీమాటలు హాస్యానికి అంటున్నాడు అనుకొన్నాను కాని, నిజంగానే అంటున్నాడని ఆఖరి క్షణంవరకు గ్రహించలేకపోయాను. 'హాస్యరచయితలో హాస్యం మరణిస్తే, హాస్యరచయిత మరణించినట్టే!' అనేవాడు నాతో. అందువల్ల తనలో హాస్యం మరణించకముందే ఈ లోకం వీడిపోతాననేవాడు. ఏమైతే నేం? ప్రఖ్యాత హాస్యరచయిత మరణించాడు. అతనికళ్ళు చారదేసి ఉండేవి. నేను విచారభారంతో క్రుంగిపోతున్నాను. కథగా మీరు అంగీకరిస్తే, విషాదాంత కథ ఔతుంది ఇది: నేనూ తృప్తిగా కళ్ళు మూస్తాను.

కృష్ణమోహన్‌రావు మా ఇంటి పక్కనే ఉండేవాడు. అతను విషం పుచ్చుకొనే ముందు నాతో చెప్పి మరీ పుచ్చుకొన్నాడు. నేనతన్ని నిలదీసి అడిగాను: 'ఇంతకీ నువ్వు ఇప్పుడు చచ్చిపోడం దేనికి?' అని. 'చచ్చిపోడం అందరికీ తప్పనిసరి! హాస్యరచయితైనా ఎప్పుడో అప్పుడు గుటుక్కు మనవలసిందే! అదంతా సరే— ఇప్పుడు నువ్వు చచ్చిపోడం దేనికి?' అని అడిగాను. 'అదంతా ఓ పెద్దగాథలే!' అన్నాడు ఓ నిట్టూర్పువిడిచి. నాకు వళ్ళు మండుకొచ్చింది; నాలుగు తిట్లు తిట్టాను. 'మహా చెప్పావులేవోయ్. చచ్చేదేమిటో ఊరికే చస్తున్నావా? నాలుగు పుస్తకాలు రాసిపడేసి చస్తున్నావ్. ఎవడికైనా నీ జీవిత చరిత్ర రాయాలని బుద్ధి పుట్టిందనుకో. ఎవడికో ఏమిటి? నాకే బుద్ధి పుడుతుంది రేపు. ఈ వివరాలన్నీ ఎక్కడ వెతుక్కుమంటావ్? ఎందుకు చస్తున్నావో చెప్పి మరీ చచ్చిపో!' అని దబాయించాను. అతను దీనంగా మొహం పెట్టాడు. పెట్టి, 'ఆ పక్కింటి అమ్మాయి లేదూ? శారద! ఆమె రేడియోలో పాట పాడింది. అదీ కారణం!' అన్నాడు. హాస్యరచయితలకు

మొదడు కొద్దిగా తక్కువుంటుందని మీకు తెలును. (మామూలు రచయితలైతే చాలా తక్కువుంటుంది) నేను మోహన్‌రావుని గట్టిగా కేకలేశాను. 'ఇంకా నయమే! ముందుగా చెప్పావ్?' అన్నాను. 'అనవసరంగా ఆత్మహత్య చేసుకొన్నావా?ముందో వెనకో ఎప్పుడో అప్పుడు పోలీసువాళ్ళు అరెస్టుచేస్తారు!' అని బెదిరించాను. 'అమ్మబాబోయ్! నిజమేనా?' అన్నాడు. మొత్తమ్మీద భయపడ్డాడు పెద్దమనిషి. అతని చేతులోంచి విషం సీసా తీసుకొని బల్లమీద పెట్టాను. సీసాకి గట్టిగా బిరడా పెట్టాను. కథ చెప్పమన్నాను. చెప్పాడు. సాంతంగా కథ విన్నాకనే, సీసా అతనికి తిరిగిఇచ్చాను. అతను మరణించాడు. నేను విచారభారంతో కృంగిపోయి ఇలా వచ్చాను. నాకు చాలా బాధగా ఉంది: అతని కళ్ళు చారెడేసి ఉండేవి.

మా ఇంటికి ఇటుపక్క కృష్ణమోహన్‌రావు వాళ్ళు ఉండేవారు. అతను హాస్యరచయితే కాదు; పత్రికావిలేఖరి కూడా. సాధారణంగా పత్రికా విలేఖరులకి తెలిసిన విషయాలు తక్కువ. తెలియదని ఒప్పుకొనే విషయాలు మరీ తక్కువ. ప్రతీ విషయాన్ని గురించి ప్రశ్న వేస్తారు. ప్రతీ విషయాన్ని గురించి మాట్లాడతారు. ఈ బుద్ధే కృష్ణమోహన్‌రావు కొంపతీసింది చివరికి.

మా ఇంటికి అటుపక్క శారదమ్మ ఉంటుంది. మనిషి బాగుంటుంది. చాలా బాగా పాడుతుంది. హైదరాబాదు రేడియోలో చాలాసార్లు పాడింది. ఇదుగో ఆమెకున్న ఈ పాడుబుద్ధే కృష్ణమోహన్‌రావు కొంపతీసింది చివరికి!

ఉన్నవాళ్లు ఉన్నటుండక, ఆలిండియా రేడియోవాళ్లు శారదమ్మని పాటపాడమని పిలిచారు — సరిగ్గా రెణ్నెల్లక్రితం, అక్టోబరు 22వ తేదీన. ఆమె పాడింది. పాడింది గదా అని నాలుగు డబ్బులు చేతిలో పడితే ఏమైంది చెప్పండి. వాళ్లో పెద్ద చెక్కు రాసిచ్చారు. చెక్కులు తెచ్చిపెట్టే చిక్కులకు లెక్కలేదు నిజానికి. ఆమె కనక రేడియోలో పాడనంటే; పోనీ పాడినా, వాళ్లు చెక్కు రాసియ్యకపోతే, కృష్ణమోహన్‌రావు కీ చిక్కులొచ్చిపడేవికావు. 'మీ అబ్బాయిచేత ఇది కాస్త మార్పించి పెడతారా?" అందిట ఆవిడ. అడిగిందే చాలనుకొని, తటాలున చెక్కు తీసుకొని, సంతకం పెటి, పక్కజేబులో పెట్టుకొన్నాడు మన వాడు. అందులోనూ లాల్చీ పక్కజేబులో, 'పత్రికా విలేఖరి దగ్గర డబ్బెవరు కొట్టేస్తారులే?' అని ధైర్యం కాబోలు - ఆ చెక్కు, కొంత డబ్బు కలిపి పక్కజేబులో పెట్టుకొన్నాడు. పెట్టుకొని, సముద్రంలా పొంగిపొరలుతున్న జనం మధ్య మునిగితేలి, బస్సు ఎక్కాడు చిక్కడపల్లి దగ్గర.

ఆ జనంలో బస్సు ఎక్కడం ఒక చిన్న యుద్ధం చేసినంత పని. చెప్పుకోతగ్గ గాయాలేమీ తగలకుండానే బస్సు ఎక్కాడు అతను. బస్సు కదిలింది. బస్సు కదలగానే జ్ఞాపకం వచ్చింది హఠాత్తుగా తన జేబులో డబ్బు ఉన్న సంగతి. పడిజేబులోకి చెయ్యిపోనిచ్చి చూసుకున్నాడు.

నెలకు ఇన్ని కేసులు పట్టుకోవాలని పోలీసువాళ్లకి ఒక రూలు ఉందిట. అలాగే నెలకు ఇన్ని జేబులు కొట్టెయ్యాలని దొంగాళ్లకి ఒక రూలు ఉండి ఉండచ్చు. నెలాఖరు వరకూ ఊరుకొని, హఠాత్తుగా ఒక అరడజను కేసులు పట్టుకొని, పోలీసువాళ్లు డయరీలు నింపుకొంటారట. దొంగలు సాధారణంగా జాగ్రత్తపరులు! నెల మొదట్లోనే ఒక అరడజను జేబులు కొట్టేసి తమ జేబులు నింపుకొంటారు. లేకపోతే, దొంగల సమాజంలో వాళ్లి పేరుప్రతిష్ఠలు నిలవ్వు. ఈ సంగతి మనకు ముందే తెలును. అందుకని మొదటివారంలో చాలా జాగ్రత్తగా ఉంటాం - మన జేబులో డబ్బున్నా, లేకపోయినా. డబ్బుంటే పోవచ్చు. డబ్బు లేకున్నా జేబే పోవచ్చు. డబ్బు లేనప్పుడు పోయిన జేబును కుట్టించుకోడానికి డబ్బెక్కణ్ణించి వస్తుంది?

నేను చెప్పిన సంఘటన వారంరోజుల క్రితం డిసెంబరు 16వ తేదీన జరిగింది. మన కథానాయకుడు, కృష్ణమోహనరావు, బస్సు ఎక్కేటప్పుడే జేబులు సరిగా చూసుకోవలసింది. చూసుకోలేదు. బస్సు ఎక్కిన తర్వాత జ్ఞాపకం వచ్చింది. అప్పటికే బస్సు దీపక్ మహాల్ బస్‌స్టాండువద్దకు వచ్చేసింది. జనం చాలమంది దిగిపోయారు. కృష్ణమోహన్‌రావు జేబులు తడిమి చూసుకొన్నాడు. అతను జేబులో పెటుకొన్న ఎనభై రూపాయల డబ్బు, డబ్భైఅయిదు రూపాయల చెక్కు-భద్రంగా ఉన్నాయి!

కృష్ణమోహన్‌రావు చిక్కడపల్లి బస్సు స్టాండువద్ద నిలబడ్డప్పుడే—దీపక్ మహల్ స్టాండువద్ద మరో వ్యక్తి విచారాన్ని సూచించే ముఖంతో నిలబడిఉన్నాడు. చార్‌మినార్ సిగరెట్టు కాలుస్తున్నాడు కాని సిగరెట్టుమీదలేదు దృష్టి అతనిది. బస్సుకోసం నిలబడ్డ ఇద్దరు ముగ్గురు వ్యక్తుల వైపు సాభిప్రాయంగా చూస్తున్నాడు. అతడు జేబుదొంగ: సందేహం లేదు: రావణాసురుడి తలకాయల్లా అతని కోటుకి పేంటుకి షర్టుకి ఎక్కడచూసినా జేబులే! అతనలా విచారంగా చూస్తూండగానే బస్సు వచ్చేసింది. బస్సులోంచి తుఫానులా దిగారు జనం, మన మిత్రుడు—జేబుదొంగ అని మనం నిశ్చయం చేసుకొన్న మిత్రుడు—జనాన్ని దూసుకొని బస్సులోకి ఎక్కబోయాడు. 'జేబులు జాగ్రత్త బాబూ!' అన్నాడు కండక్టరు దిగేవాళ్ళ నుద్దేశించి (కండక్టర్లు సర్వజ్ఞులు: వాళ్ళకన్నీ తెలుసు. వాళ్ళకి జేబుదొంగ లందరూ కంఠతః వచ్చు.) అందరూ జేబులు తడుముకొన్నారు. మన మిత్రుడు కూడా తడుముకొన్నాడు. కృష్ణమోహన్‌రావు కూడా తడుముకొన్నాడు, బస్సులో నిలబడి జేబులోంచి డబ్బు పైకితీసి చూసుకొన్నాడు; తృప్తిగా మళ్ళీ జేబులో పెట్టుకొన్నాడు. బస్సు కదిలింది. కథానాయకుడు ఆనాటి పేపరు తీసి తలపంకిస్తూ చదవడం ప్రారంభించాడు.

ఆ తరువాత కథ ఎలా చెప్పాలో నాకు అర్థం కావడంలేదు. మనమిత్రుడు బస్సులో ప్రవేశించడం, పుల్లీబావుడీవరకు టిక్కెట్టు తీసుకోడం, కథానాయకుడి వద్దకు వచ్చి 'జరా హఠియే!' అని పక్కన కూచోడం, తరువాత పుల్లీబావుడీ రాకుండానే కాచిగూడా చౌరస్తాదగ్గరే దిగిపోడం—ఇవన్నీ చెప్పకుండా వదిలేస్తేనే మంచిదేమో! నాకు కథలు రాయడం చేతకాదు. అందులోనూ విచారభారంతో క్రుంగిపోయి ఉన్నాను. ఇదంతా ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు. చివర్ని ఏం జరిగిందో మీరు గ్రహించే ఉంటారు.

మన మిత్రుడు కాచీగూడా చౌరస్తా దగ్గర బస్సుదిగిపోయాడు. అతను బస్సు దిగుతూంటే, మరోమిత్రుడు బస్సెక్కాడు.

చరిత్రాధ్యాపకులు: ఓరేకృష్ణా నీకు తెలిసినమట్టుకి ఇపుడు యుద్ధము ఎవరెవరికి జరుగుతోంది.? ఎవరికి జయము రావచ్చు?

కృష్ణ: ఒకగంట క్రితము ఇంటివద్ద మా అమ్మకు, మా నాన్నకి యుద్ధము జరుగుతూవుందండి. మాఅమ్మకు అప్పడాలకఱ్ఱ, చీపురుకట్ట, రోకలి, మొదలయిన ఆయుధాలు వుండుటచేత మా అమ్మకే జయము రావచ్చునండి.

—గవ్వా కన్నారావు, విజయనగరం

# "హాస్యరచయిత మరణించాడు"

బస్సెక్కి, ఇతన్ని చూసి వెనక్కి తిరిగి నవ్వాడు. ఇద్దరూ స్నేహితులయ్యుండాలి.

కండక్టరు కృష్ణమోహన్‌రావు దగ్గరకు వచ్చాడు. 'మీ దగ్గర ఏమైనా డబ్బుందా? పోయిందా?' అన్నాడు. కృష్ణమోహన్‌రావు చటుక్కున జేబు తడుముకున్నాడు. డబ్బుపోయింది. 'ఉంది; లేదు' అన్నాడు అదోలా మొహంపెట్టి. కండక్టరు ఒక నవ్వు నవ్వాడు. 'వాడో జేబుదొంగ లెండి. నాకు తెలుసు. అందుకనే అడిగాను' అన్నాడు. అని వెళ్లి బెల్లు నొక్కాడు. నొక్కగానే బస్సు కదిలింది.

'ఉంది; లేదు' అనడంలో కృష్ణమోహన్‌రావు ఉద్దేశం: 'డబ్బు అసలు ఉంది కాని, ఇప్పుడు లేదు' అని. 'డబ్బు ఉంది;పోలేదు' అని ఇతనన్నాడని అతననుకొన్నాడు. అనుకొని. నవ్వి, వెళ్లి బెల్లునొక్కాడు. నొక్కగానే బస్సుకదిలింది.

కృష్ణమోహన్‌రావు మహానటుడే కావచ్చు! అతను హఠాత్తుగా 'హా! చచ్చితి చచ్చితి. ఇప్పుడేమిచేతు? కటకటా! దైవమా! హాత విధీ! నాకేలరా దుర్గతి తెచ్చిపెట్టితివి? నా ధనమంతయు పోయెనే?' అని అరిచినట్లయితే, కండక్టరు బెలునొక్కేవాడు కాదు. అతను ఒకటోరకం అమెచ్యూర్ వేదాంతిలా మొహంపెట్టాడు. పెట్టేసరికి, డబ్బు పోలేదు కాబోలనుకున్నాడు కండక్టరు. జీవితంలో ఉపయోగపడని నటనవల్ల ప్రయోజనంఏమిటి చెప్పండి!

కృష్ణమోహన్‌రావు కండక్టరుదగ్గరకు వెళ్ళి, 'బస్సు ఆపు!' అన్నాడు. 'ఏం?' అన్నాడు కండక్టరు. 'డబ్బుపోయింది' అన్నాడు మనవాడు, 'మరి-ఇందాకా చెప్పలేదేం?' అన్నాడు కండక్టరు. అంటూనే బెల్లు నొక్కాడు. బస్సు ఆగింది. 'ఎంత?' అన్నాడు ఒక ప్యాసింజరు. 'ఎప్పుడు?' అన్నాడు మరో ప్యాసింజరు. 'ఏమిటి?' అని అడిగింది ఒక లేడీ ప్యాసెంజరు. 'డబ్బు పోయిందట!' అంది మరో లేడీ ప్యాసెంజరు. 'ఎంతట?' అంది మూడో లేడీ ప్యాసింజరు. 'పేసెంజరతో మాట్లాడుతూ, బస్సు ఆపుతా వేమిటి?' అని గదమాయించాడు డ్రైవరు. 'ఇంతకూ ఎవరు కొట్టేశారు?' అని అడిగాడు ఒక లాయరు, ఆశావాదిలా మొహంపెట్టి 'దొంగాట' అంది, ఆయన పెళ్లాం కాబోసు, మెరుస్తున్న కళ్ళతో, 'హోరి నీ ఇల్లు బంగారంకాను!...ఉత్తి గద్దు రోజులమ్మ ఇవి.' అంది ఆవిడ అత్తగారి లాంటావిడ ఒకావిడ.

'బస్సుపోనియ్యి!' అన్నాడు కృష్ణమోహనరావు, క్లుప్తంగా, కండక్టరుతో.

ప్రథమ పురుషలో కథ చెప్పేటప్పుడు తనకు తెలియడానికి వీలులేని విషయాలను గురించి చెప్పకూడదని ఏదో పుస్తకంలో చదివాను. కాని ఆ విషయాలనుగురించి చెప్పకపోతే ఇప్పుడు కథ నడువదు. వినా మీరు అందరూ నా స్నేహితులే కాబట్టి చెప్పేస్తాను.

మనమిత్రుడు-జేబుదొంగ-బస్సు దిగానే మొదట చేసినపని ఒక రిక్షాపిలిచి కాచిగూడా స్టేషనుకి పోవడం. అసలు అతను చాలా మంచివాడు. తను దొంగలసమాజానికి ప్రెసిడెంటు కాబట్టి, అప్పుడప్పుడు దొంగతనం చేయకపోతే సమాజంలో అప్రతిష్ఠ అని కాకపోతే - అతని కది సుతరామూ ఇష్టం లేదు.

బస్సులో అతనికి ఒక మూర్ఖుడు డబ్బు లెక్క చూసుకొంటూ కనపడ్డాడు. (మూర్ఖుడు-ఎవరో తెలుసుగా?) ఎందుకైనా మంచిదని అతని జేబులో చెయ్యిపెట్టాడు పక్కన కూచొని. ఐదురూపాయలకట్ట చేతికొస్తే అది తన జేబులోకి బదిలీచేశాడు. 'అదృష్టవంతుణ్ణి ఈవాళ' అనుకొంటూ రిక్షా ఎక్కి కాచిగూడా వచ్చేశాడు. వచ్చి తీరా జేబుచూసుకొనేసరికి ఐదురూపాయల కట్ట మాయమైంది. 'ఏమా?' అని ఆలోచించేసరికి తను బస్సు దిగేటప్పుడు బస్సు ఎక్కిన పెద్దమనిషి జ్ఞాపకం వచ్చాడు. మనసు చివుక్కుమంది అతనికి. పోలీసువాళ్లకి రిపోర్టు చేద్దామా? అనుకున్నాడు. అయినా డబ్బు పోతే మళ్ళీ దొరుకుతుందా ఏమిటి అనుకొని మాట్లాడకూరుకొన్నాడు. డబ్బు పోగా చెక్కు మిగిలింది. చెక్కుమీద సంతకం పెట్టే ఉంది. కాని చెక్కు పట్టుకెళ్ళి బేంకులో ఇస్తే పోలీసులు తపిమని పట్టుకొంటారని తెలుసు. 'చింపేద్దామా?' అనుకొన్నాడు. కాని ఒక నిముషం ఆగి ఆలోచించాడు. పరధ్యానంగా జేబు రుమాలు తీసి చెక్కును అటూ ఇటూ తుడిచాడు. అలవాట్లన్నీ ఎక్కడికి పోతాయి?

ఈలోగా బస్సు కోఠీవద్ద ఆగింది. కృష్ణమోహన్‌రావు కూడా దిగిపోయాడు. దిగిపోతూ, ఎందుకైనా మంచిదని 'ఆ దొంగాణ్ని ఆనవాలు పట్టగలవా?' అని అడిగాడు కండక్టర్ని, 'వెళ్లాళ్ళయినా గుర్తుపడతా' నన్నాడు కండక్టరు. కృష్ణమోహన్ 'నీపేరు చెప్పు-పోలీసులకి రిపోర్టు చేస్తాను' అన్నాడు. కండక్టరు ఇతన్ని మింగేసేటట్టు చూస్తూ, పళ్లు పటపట కొరికాడు. పేరడిగితే ఎవరికైనా కోపం వస్తుంది. అందులో ఎవడో కొత్తవాణ్ణి పిలిచి, 'నీపేరు చెప్పు, పోలీసువాళ్ళకి రిపోర్టు చేస్తా!' అంటే ఎందుకు చెబుతాడు? 'నాయనా, నీపేరు చెప్పు. నీసహాయం కావాలి నాకు.దొంగాణ్ణి పట్టుకోవాలి' అంటే చెప్పేవాడు. బహుశః కండక్టరు కళ్ళెర్రచేసి చూస్తూనే, బెల్లు నొక్కేశాడు. బస్సు కదిలిపోయింది. 'క్యా హోగయా?' అంటూమూగారు రిక్షావాళ్ళందరూ రిక్షా జన సహజ కుతూహలంతో. కృష్ణమోహన్‌రావుకి అక్కడే ఉరిపోసుకు చచ్చిపోదామని బుద్ధి పుట్టిందిట. కాని తాడు దొరక్క ఊరుకొన్నాట్ట.

కృష్ణమోహన్‌రావు పత్రికా విలేఖరి




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జిలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

కాకపోతే చాలా బాగుండేది. అసలు శారదమ్మ రేడియోలో పాడకుండా ఉంటే, చాలా బాగుండేది. ఆమె పాడినా, రేడియో వాళ్లు చెక్కు ఇవ్వకుండా, డబ్బిస్తే చాలా బాగుండేది. మన కథానాయకుడు చనిపోయేవాడు కాదు. శారదమ్మ రేడియోలో పాడింది. ప్రఖ్యాత హాస్య రచయిత మరణించాడు. నేను విచారభారంతో క్రుంగిపోతున్నారు.

మోహన్‌రావు పత్రికా విలేఖరి కాకపోతే, అతనికి పోలీసులకి రిపోర్టుచేయాలని బుద్ధిపుట్టేదికాదు. కాని అతనికి అలా బుద్ధి పుట్టింది. పోలీసు వాళ్ళకి మెదడు కొద్దిగా తక్కువిస్తాడు భగవంతుడు అని లోకంలో ఒక ప్రతీతి ఉంది. ఇది చాలా అన్యాయమేమో? ఎవరు పోలీసువాడౌతాడో, ఎవరు కాడో, ఎంత భగవంతుడైతే మాత్రం, ఎలా తెలుస్తుంది భగవంతుడికి ముందు? అసలు పోలీసు వాళ్ళని ఎన్నుకొనేముందే, మెదడు తక్కువ వాళ్ళని ఎన్నుకొంటారని కొందరు అంటారు. దొంగకనక వెనక్కి తిరిగితే, తిటాలున మీదపడి పట్టుకొని కట్టేయగలిగిన వారిని సబిన్స్పెక్టర్లుగా ఎన్నుకొంటారని కూడా అంటారు. ఇదంతా ఉత్తి అతిశయోక్తి అనుకొంటాను. కృష్ణమోహన్‌రావు పోలీసులకి రిపోర్టుచేశాడు. 'డబ్బా! పోయిందా? అప్పుడే ఖర్చు పెట్టేసుంటాడు' అన్నాడు సబిన్స్పెక్టరు. చెక్కుకూడా పోయిందని చెప్పాడు ఇతను. 'చెక్కు కూడానా? అప్పుడే మార్చేసుంటాడు' అన్నాడు సబిన్స్పెక్టర్. 'బేంకువాళ్ళకి ఫోను చెయ్యవయ్యా!' అన్నాడు మనవాడు. 'ఫోనుకేం? చేస్తాను. కాని ఏం లాభంలేదు' అన్నాడు సబిన్స్పెక్టరు, తలకాయ అడ్డంగా తిప్పడానికి ప్రయత్నించేస్తూ.

పోలీసు స్టేషన్‌నుంచి బయటకు రాగానే, ఆత్మహత్య చేసుకుందామనుకున్నాట కృష్ణమోహన్‌రావు. 'నీ తుపాకీ ఓసారి ఇస్తావా ఆత్మహత్య చేసుకు మళ్ళీ ఇచ్చేస్తాను' అంటే ఇవ్వనన్నాట పోలీసువాడు.

దొంగాడు చాలా మంచివాడని చెప్పాను. ఇంకోడయితే, చింపి అరతల పారేసేవాడు. మంచివాడు కాబట్టి ఒక కవరులో పెట్టి సెంట్రల్ బేంకుకి పంపించాడు. చెక్కు చెదరకుండా వచ్చింది చెక్కు; వస్తూనే తెచ్చిపెట్టింది చిక్కు. దాన్ని ఏంచేయాలో తెలియలేదు గుమాస్తాకి. ఆఫీసరు గారికి కూడా తెలియలేదు. అందుకని ఆయన గుమాస్తాని గట్టిగా కొప్పడ్డాట! తీరా హైదరాబాదు స్టేటుబేంకుకి పంపిస్తే ఆ ఆఫీసరుకి కూడా తెలియలేదుట ఏంచేయాలో. గుమాస్తాకి కూడా తెలియలేదుట అందుకని ఆ ఆఫీసరు గారు ఈ ఆఫీసరుగారిని టెలిఫోనులో పిలిచి తిట్టారట. అక్కడి గుమాస్తా ఇక్కడి గుమాస్తాని కొరకొరా చూశాట్ట. ఆలిండియా రేడియోవాళ్ళని టెలిఫోనులో పిలిచి "ఏమంటారు?" అని అడిగితే, వాళ్ళు దొంగాణ్ణి ఒక్కణ్ణే మినహాయించి, మిగిలిన వారి నందరినీ పేరు పేరున తిట్టారట. ఈ పరిస్థితుల్లో ఏంచేయాలో కృష్ణమోహన్‌కి తెలియలేదు. ఆత్మహత్య చేసుకుందామని నిశ్చయించుకున్నాడు. 'నీదగ్గర కాస్త కత్తి ఉంటే ఇస్తావా? మళ్లీ ఇచ్చేస్తాను చచ్చిపోయిన తర్వాత' అని ఎదురుగా ఉన్న బేంకు గుమాస్తా నడిగాడు. అతగాడు కళ్లెర్ర చేసి చూసి, 'చాలు చాలే! బ్రతికి ఉద్ధరించావు! చచ్చి సాధిస్తావు కాబోలు!' అన్నాడు; అని బల్లమీద ఉన్న బ్లేడుతీసి డ్రాయర్లో పడేసుకొన్నాడు.

పత్రికా విలేఖర్లు అప్పుడప్పుడు చచ్చిపోతూనే ఉంటారు కాని, బ్రతికున్నప్పుడు బ్రతికే ఉంటారు. అందుకని దొంగాణ్ని పట్టుకొనే ప్రయత్నం మానలేదు మనవాడు.

ఎట్టకేలకు చెక్కు చిక్కింది అతని చేతికి. 'ఎలా చిక్కిందని?' అని అడక్కండి: ఇది బేంకింగ్ సీక్రెట్! మీరూ నేనూ అయితే, చెక్కు చిక్కితే రిక్షాఎక్కి బేంకుకి పరుగెడతాం. కాని మోహన్‌రావు పత్రికా విలేఖరి అన్న సంగతి మనం మరిచిపోకూడదు. చెక్కుమీద వేలుముద్రలేమైనా ఉన్నాయేమో చూడడానికి పోలీసు స్టేషన్‌కి పయనమైనాడు. కళ్ళద్దాల నుంచి భూతద్దాలవరకు అన్నీ పెట్టుకు పరిశీలించారట అందరూ కలిసి. చెక్కుమీద జేబుదొంగ వేలుముద్ర దొరకలేదు. కాని కృష్ణమోహన్‌రావువి, వాళ్లమ్మగారివి, వాళ్లింట్లో అవ్వపిల్లవి, శారదమ్మవి, వాళ్ల అవ్వపిల్లవి, పాతికో పరకో బేంకు గుమాస్తాలవి కనపడ్డాయి. 'వీళ్లందరినీ లాకప్‌లో పెట్టేస్తేనో?' అని మృదువుగా సూచించాడు సహృదయుడు సబిన్స్పెక్టరు.

ఆత్మహత్య చేసుకుందామన్న నిశ్చయం దృఢమైంది రావుకి. 'మీదగ్గర కత్తెరా కత్తీ ఏమైనాఉంటే ఇస్తారా? మళ్ళీ ఇచ్చేస్తాను మరిచిపోకుండా' అన్నాట అతను. 'మళ్లా మాటాడితే అరెస్టు చేస్తాను', అన్నాడు సబిన్స్పెక్టరు.

కృష్ణమోహన్‌రావు చెక్కు తీసుకొని స్టేటుబేంకుకి వెళ్ళాడు. 'ఏమిటి?' అన్నాట్ట గుమాస్తా. 'చెక్కు' అన్నాట్ట ఇతను. అతను ఇతనివైపు జాలిగాను, చెక్కువైపు తీవ్రంగా చూశాట్ట. 'నాయనా! వెళ్లిపో! ఎందుకు చెబుతున్నానో వెళ్ళిపో. చేతకాని దొంగతనాలు ఇంకెప్పుడూ చెయ్యకు' అన్నాట్ట. 'ఈ చెక్కు నాదేనండీ!' అన్నాట్ట ఇతను. 'పోలీసువాళ్ళను పిలవనా?' అన్నాట్ట అతను అదోలా నవ్వి.


'ఈ పరిస్థితులలో నేను ఆత్మహత్య చేసుకోకం చేస్తాను?' అని కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు కృష్ణమోహన్. అతన్ని చూస్తే, నాకు కడుపు తరుక్కుపోయింది. 'భేష్!' అని వీపు తట్టాను. నా చేతుల్తో నేనే బిరడాతీసి, విషం సీసా చేతి కందిచ్చాను. అతను విషం తినేసి మరణించాడు.

కృష్ణమోహన్‌రావు, ప్రఖ్యాత హాస్య రచయిత, మరణించాడు. ఆఖరుక్షణంవరకూ నేను అతనితోనే ఉన్నాను. తరువాత విచారభారంతో క్రుంగిపోయి ఇలా వచ్చాను. నాకు చాలా బాధగా ఉంది: అతని కళ్లు చారెడేసి ఉండేవి.

## ఉపసంహారం

ఇది కథ కాదని మీరు ఒప్పుకోకపోవా బహుశః. మీరు ఒప్పుకోకపోయినా నేను చేసేది ఏమీ లేదు. కాని ఒక్కవిషయం: 'హాస్యరచయిత మరణించాడు' అన్నాను. అంతా ఉత్తిది. నిజంగా బ్రతికేఉన్నాడు. కాని కథంటే అంతేగదా? ★


విషపు కోతగాయములు



జామ్-బక్‌తో త్వరితంగా శమనమగును

కోతగాయములు, పగుళ్లు, కీటక కాటులు, మూడు రోజులలో మానిపోవును. కాలిపాపుల వ్రణములు, పుండ్లు, కాల్పులు, మరియు విషపు గాయములు ఏడు రోజులలో శమనమగును. ఎగ్జిమా మరియు తలగజ్జి శతణం రహితమగును. మీరు జామ్-బక్‌తో నివారించుకో గలరు — చర్మ వ్యాధులకు సకల గుణకరమైన మూలికా ఔషధము. ఇందు ఇంకు క్రొవ్వులుగాని మూలెలుగాని లేవని గ్యారంటీ చేయబడినది.

Zam-Buk
జామ్-బక్
మూలికా బామ్



జామ్ బక్ జిడ్డుగా లేని ఔషధ క్రీమును వాడి చూడుడు... ఒక్కదాని యందే చర్మ చికిత్స చర్మ సౌందర్యము గలిగించు గుణములు గలవి.
మందుల వ్యాపారులందరి వద్దను దొరకును
ఫి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి.
సోల్ ఏజెంట్లు: దాదా & కంపెనీ,
86, సైనప్ప నాయకన్ వీధి, మద్రాసు-1